నమస్తే తెలంగాణ
నల్లగొండ
12 | నల్లగొండ, మంగళవారం 18 మార్చి 2025 | NALGONDA

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, పార్టీ శ్రేణులు

గుండాల, మార్చి 17 : మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని శాసన సభ సమావేశాల నుంచి సస్పెన్షన్ చేయడాన్ని నిరసిస్తూ మండలంలోని వెల్మజాల గ్రామంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు ఎండీ ఖలీల్, మాజీ వైస్ ఎంపీపీ మహేశ్వరం మహేందర్‌రెడ్డి, నాయకులు మూగల శ్రీనివాస్, బబ్బూరి సుధాకర్, పొన్నగాని మహేశ్, బొంగు శ్రీశైలం, కోలుకొండ రాములు, బాల్‌రెడ్డి, చెన్నారెడ్డి, రంగారెడ్డి, మమత, యాదలక్ష్మి, బాల కొమురయ్య, బాలకృష్ణ, మత్స్యగిరి, లింగస్వామి, దయాకర్, నాగరాజు, బాలమల్లు, అనిల్, రాజు, పాండు, భాస్కర్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గాదరి కిషోర్, బొల్లం మల్లయ్యయాదవ్,

అడుగంటుతున్న సాగర్

డెడ్‌స్టోరేజీకి చేరువలో నీటిమట్టం

పది రోజుల్లో కనీస నీటిమట్టానికి చేరుకునే ప్రమాదం

డెడ్‌స్టోరేజీకిపైన అందుబాటులో 15.7890 టీఎంసీల నీరు

ప్రస్తుతం నీటిమట్టం 519 అడుగులు

ఈ ఏడాది పుష్కలంగా కృష్ణా ప్రవాహం

627టీఎంసీలు సముద్రం పాలు

నీటి విడుదలపై ప్రణాళిక లోపంతో కష్టాలు

వేసవి గట్టెక్కేది అనుమానమేనన్న సందేహాలు

నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లో అడుగంటుతున్న నీరు

నల్లగొండ ప్రతినిధి, మార్చి17(నమస్తే తెలంగాణ) /నందికొండ : కృష్ణా పరీవాహక ప్రాంతంలో గత వానకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రాజెక్టులన్నీ పొంగి పొర్లిన విషయం తెలిసిందే. ఆల్మట్టి నుంచి మొదలుపెట్టి పులిచింతల వరకు అన్ని ప్రాజెక్టుల గేట్లు ఎత్తి నీటిని దిగువ వదలగా వంద లాది టీఎంసీ నీరు సముద్రం పాలైంది. అంటే, ప్రాజెక్టుల్లో ఇప్పటికీ పుష్కలంగా నీరు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉంది. కానీ వేసవి ప్రారంభంలోనే కృష్ణానది ప్రాజెక్టుల్లో నీటి మట్టాలు కనీస స్థాయికి చేరువవుతుండడం ఆందోళనకు గురిచేస్తున్నది. ముఖ్యంగా నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని ఎడమ, కుడి కాల్వలతోపాటు ఏఎమ్మార్పీ ప్రాజెక్టు పరిధిలోనూ మరో నెల రోజుల పాటు పంటలకు సాగునీటితో పాటు మళ్లీ వానకాలంలో వర్షాలు కురిసే వరకు తాగునీటి అవసరాలు తీరాల్సి ఉంది. ప్రభుత్వానికి నీటి విడుదల, భవిష్యత్ అవసరాలపై సరైన ప్రణాళిక లేకపోవడంతో మార్చి మధ్యలోనే నాగార్జునసాగర్ రిజర్వాయర్ డెడ్‌స్టోరేజీకి చేరుతున్నదని నీటి పారుదల నిపుణులు చెప్తున్నారు. ఏప్రిల్ మొదటి వారం వరకు ఆయకట్టుకు సాగునీటి అవసరం ఉండగా డెడ్ స్టోరేజీకి చేరుకున్నాక ఏం చేస్తారన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లో నీటి నిల్వలు రోజురోజుకూ అడుగంటుతుండడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నది. రానున్న రోజుల్లో తాగు, సాగు నీటికి కష్టాలు తప్పేట్లు లేదని సాగునీటి రంగ ఇంజినీర్లు హెచ్చరిస్తున్నారు. నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు ఈ ఏడాది వరద ఆశాజనకంగా రావడంతోపాటు ఎడతెరిపి లేకుండా మూడు నెలల పాటు క్రస్ట్ గేట్ల ద్వారా 627 టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేశారు. ఆ నీరంతా ప్రకాశం బ్యారేజీ ద్వారా సముద్రం పాలైంది. ఈ ఏడాది నాగార్జునసాగర్ ఆయకట్టు కింద రెండు పంటలకు నీటికి ఢోకా ఉండదని అందరూ భావించినా, అందుకు భిన్నంగా అనూహ్యంగా సాగర్ చూస్తుండగానే డెడ్ స్టోరేజీకి చేరుకుంటున్నది.

డెడ్ స్టోరేజీకి పైన 15.7890 టీఎంసీల నీరు

నాగార్జునసాగర్ రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 590 అడుగులు(312 టీఎంసీలు) కాగా, డెడ్ స్టోరేజీగా 510 (131.6690 టీఎంసీలుగా) అడుగులుగా నిర్ధారించారు. వానకాలంలో కురిసిన వర్షాలతో రెండు నెలలకు పైగా అంటే నవంబర్ చివరి వరకు రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టంతో కళకళలాడింది. ఆ తర్వాత యాసంగి పంటలకు నీటి విడుదలతోపాటు ఆంధ్రప్రదేశ్ అక్రమంగా నీటిని తరలించుకుపోతుండడంతో వేగంగా నీటిమట్టం తగ్గిపోతూ వచ్చింది. దాంతో సరిగ్గా మూడు నెలల్లోనే సాగర్ డెడ్‌స్టోరేజీకి చేరువైంది. సోమవారం సాయంత్రం 6గంటల సమయానికి నాగార్జున సాగర్‌లో నీటి నిల్వ 519 అడుగుల వద్ద 147.4580 టీఎంసీలుగా ఉంది. డెడ్ స్టోరేజీకి పైన 9 అడుగులు (15.7890టీఎంసీలు) నీరు మాత్రమే నిల్వ ఉంది. ప్రస్తుతం నాగార్జునసాగర్ రిజర్వాయర్ నుంచి కుడి కాల్వ ద్వారా 7,033 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 8,454 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నది. రోజూ నాగార్జునసాగర్ రిజర్వాయర్ నుంచి తాగు, సాగుకు నీటి విడుదల కొనసాగుతున్నది. సగటున రెండు రోజులకు గానూ నాగార్జునసాగర్ నుంచి 2 టీఎంసీలు నీరు వినియోగిస్తుండడంతో రోజుకు 0.5 అడుగుల మేరు నీరు తగ్గుతున్నది. ఇదే రీతిన కొనసాగితే వారం, పది రోజుల్లోనే రిజర్వాయర్ నీటిమట్టం డెడ్ స్టోరేజీకి చేరుకోనుంది.

ప్రశ్నార్థకంగా సాగు, తాగు నీటి విడుదల

నాగార్జున సాగర్ రిజర్వాయర్‌కు గతేడాది జూలై నెలలో ఎగువ నుంచి వరద నీరు రాక మొదలైంది. దాంతో ఆగస్టు 2 నుంచి ఎడమ, కుడి కాల్వలకు సాగునీటి విడుదలను ప్రారంభించి మొదటి విడుతగా డిసెంబర్ 15 వరకు వానకాలం పంటలకు నీళ్లు ఇచ్చారు. డిసెంబర్ 15 నుంచి యాసంగి పంటలకు ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో నీటి విడుదలను ప్రారంభించారు. ఎడమ కాల్వ ద్వారా ప్రస్తుత సాగుకు వచ్చే నెల 23 వరకు పంటలకు సాగు నీరు ఇవ్వాల్సి ఉంది. రోజుకు ఎడమ కాల్వకు యావరేజీగా 7,500 క్యూసెక్కుల నీటిని విడుదల కొనసాగిస్తే రబీ పంట కాలం పూర్తవడానికి మరో 36 రోజులకు గానూ 27 టీఎంసీ నీరు అవసరం అవుతుంది. దాంతోపాటు కుడి కాల్వకు సగటున 8వేల క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెకుల నీరు రోజూ కొనసాగుతుండడంతో నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లో నిల్వ ఉన్న నీరు సాగు, తాగు అవసరాలకు ప్రశ్నార్థక మేనని నిపుణులు చెప్తున్నారు. కుడి, ఎడమ కాల్వల ద్వారా పంటలకు, ఎస్ఎల్‌బీసీ తాగునీటి అవసరాలకు ఇవ్వాలంటే నాగార్జునసాగర్ డెడ్ స్టోర్‌జీ కంటే దిగువకు నీరును తోడుకోవాల్సి వస్తుందని తెలిపారు. ఆ పరిస్థితి వస్తే సాగర్ ఆయకట్టులో సాగు, తాగుకు నీటి కష్టాలు తప్పవని సాగునీటి నిపుణులు, మాజీ ఇంజినీర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కుడికాల్వ ద్వారా జోరుగా కొనసాగుతున్న నీటి విడుదల

నీటి నిర్వహణ సరిగ్గా లేక..

నాగార్జున సాగర్ రిజర్వాయర్‌లో ఈ ఏడాది నీరు పుష్కలంగా వచ్చి చేరినా సరైన నిర్వహణ లేకపోవడంతో కృష్ణా నీటిని ఇష్టానుసారంగా వాడుకున్నారు. నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు ఈ ఏడాది 1,203 టీఎంసీల నీరు వచ్చి చేరగా, కుడి కాల్వకు 185 టీఎంసీలు, ఎడమ కాల్వకు 114 టీఎంసీలు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 245 టీఎంసీ నీటిని విడుదల చేశారు. క్రస్ట్ గేట్ల ద్వారా మూడు నెలల పాటు 623 టీఎంసీల నీటిని సముద్రం పాలు చేశారు. నీటి వినియోగంపై ప్రభుత్వానికి సరైన ప్రణాళిక లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే సమయంలో సాగర్ నుంచి ఏపీ ప్రభుత్వం విచ్చలవిడిగా నీటిని తరలిస్తున్నా పట్టించుకోలేదన్నది వాస్తవం. మళ్లీ వర్షాలు కురిసి వరదలు రావడానికి నాలుగు నెలల సమయం ఉండగా, ఇప్పటికే సాగర్‌లో నీరు లేకుండా పోతుండడం గమనార్హం.

కుడికాల్వకు యథేచ్ఛగా నీటి విడుదల

వానకాలం ప్రారంభం నుంచి కుడి కాల్వకు ప్రారంభమైన నీటి విడుదల యథేచ్ఛగా కొనసాగుతూనే ఉంది. కుడి కాల్వపై ఏర్పాటు చేసిన టెలీమీటర్ (నీటి విడుదల లెక్కింపు యంత్రం) తుమ్మ చెట్ల పొదల్లో కమ్ముకుపోయి ఉంది. కుడి కాల్వకు అధికారులు చెప్పే లెక్కల కంటే అధికంగానే నీటి ప్రవాహం కొనసాగుతున్నది. ఇది సరిపోక ఎడమ కాల్వ ద్వారా కూడా తమ ప్రాంతానికి నీరు కావాలని కేఆర్‌ఎంబీకి ఆంధ్రా పాలకులు లేఖలు రాస్తున్నారు.

ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగానే..

నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లో ఉన్న ప్రస్తుత నీటి నిల్వలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నాం. ఉన్నతాధికారులు ఆదేశాల ప్రకారం నీటి విడుదల కొనసాగుతుంది. ప్రస్తుతం నీటి నిల్వలపై రెండు రాష్ట్రాల అధికారులు చర్చించారు. సాగు, తాగు నీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నం. వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా అవసరమైతే శ్రీశైలం రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకునే అవకాశం ఉంది.

-మల్లికార్జున్, ఎన్ఎస్పీ ఈఈ

ప్రభుత్వ చేతగానితనాన్ని ఎండగట్టాలి

- **దళిత స్పీకర్ అంటూ పదే పదే మీరే స్పీకర్‌ను అవమానిస్తున్నారు**
- **ఓటుకు నోటు కేసులో దొంగ రేవంత్.. నువ్వా కేసీఆర్ గురించి మాట్లాడేది**
- **24 గంటల్లో 24 అబద్దాలాడే సీఎం ఇప్పుడే చూస్తున్నాం**
- **నీళ్లు ఇచ్చేందుకు అవకాశం ఉన్నా పంటలు ఎండబెడుతున్నారు**
- **సీఎం రేవంత్‌కు బుద్ధి చెప్పి తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకోవాలి**
- **20న సూర్యాపేటకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాక**
- **బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గాదరి కిశోర్, మల్లయ్యయాదవ్**

సూర్యాపేట టౌన్, మార్చి 17 : ప్రభుత్వం చేతగాని, చేవలేనితనాన్ని ఎండగడుతూ ప్రజల పక్షాన కొట్లాడే ప్రధాన పాత్రను బీఆర్ఎస్ పార్టీ పోషిస్తున్నదని, అందులో భాగంగా ఈ నెల 20న సూర్యాపేట జిల్లాకేంద్రంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గాదరి కిశోర్‌కుమార్, బొల్లం మల్లయ్యయాదవ్ తెలిపారు. సోమవారం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వాళ్లు మాట్లాడారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి స్పీకర్‌ను అవమానించినట్లు వీడియోల్లో ఎక్కడా లేదని, అయినా అదే సాకుగా చూపి దళిత స్పీకర్‌ను అంటారా అంటూ పదే పదే స్పీకర్‌ను కాంగ్రెస్ నేతలు అవమానిస్తున్నారు. జగదీశ్‌రెడ్డి అసెంబ్లీలో ఉంటే వారి ఆటలు సాగడం లేదని, అప్రజాస్వామికంగా ఆయన్ని బయటకు పంపారని మండిపడ్డారు. అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి తోలు తీస్తా.. బట్టలూదీసి కొడుతా అంటూ జర్నలిస్టులపై నోరుపారేసుకోవడం చూస్తే ఆయన మెంటల్ లేచిందేమోనని అనిపిస్తుందన్నారు. అసెంబ్లీ సాక్షిగా అలాంటి భాష మాట్లాడితే ఒక్క మేధావి గానీ, ఒక్క జర్నలిస్టు గానీ మాట్లాడడం లేదని, స్పీకర్ రికార్డుల నుంచి తొలగించాల్సిందిపోయి నవ్వుకుంటూ కూర్చున్నారని విమర్శించారు. నా కుటుంబం జోలికి వస్తే ఊరుకోను అనే రేవంత్‌రెడ్డి మాటలు ఆయా కుటుంబాలు బాధపడలేదా అని ప్రశ్నించారు. బడ్జెట్‌లో పెట్టడానికి డబ్బులు లేవు.. ఇచ్చిన హామీలు అమలు చేయడానికి చేతగాదు.. ఒకటో తారీఖు జీతాలు ఇవ్వలేరు.. వాటిని పక్కదారి పట్టించేందుకు కేసీఆర్, కేటీఆర్, జగదీశ్‌రెడ్డిని ఏదో ఒకటి అనడం చేతగానివాడు చేసే రాజకీయమన్నారు. తెలంగాణ కోసం పార్టీ పెట్టి ఢిల్లీ వెళ్లి గల్లీ గల్లీ తిరిగి కనపడ్డోని కాళ్లు మొక్కి 14 ఏండ్లు ఉద్యమం చేసి ఢిల్లీ మెడలు వంచి ప్రత్యేక రాష్ట్రం తెచ్చిన తెలంగాణ జాతిపిత కేసీఆర్‌ను స్ట్రెచర్ మీదకు పోయిండు.. మార్చురీకి పోతడని ఆయన చావు కోరుకోవడం దుర్మార్గమని మండిపడ్డారు. ఇదేందని అడిగితే నేను పార్టీని తిట్టిన.. కేసీఆర్‌ను అనలేదని 24 గంటల్లో 24 అబద్దాలు మాట్లాడుతున్నారన్నారు. నాడు తెలంగాణకు వ్యతిరేకంగా చంద్రబాబు సంకన చేరి స్టీఫెన్‌కు రూ.50లక్షల మూటను ఇచ్చి ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ రేవంత్‌రెడ్డి.. నువ్వా కేసీఆర్ గురించి మాట్లాడేది దుయ్యబట్టారు. నోరు తెరిస్తే బూతులు తప్ప ఒక్క మాట సరిగ్గా లేదని, పొద్దుగాల లేచిన దగ్గరి నుంచి కేసీఆర్ జపం లేకపోవతే నీకు బతుకు లేదని మండిపడ్డారు. నోటికి ఏది వస్తే అది కాకుండా ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు. తుంగతుర్తి నియోజకవర్గంలో వేల ఎకరాలు ఎండిపోతున్నాయని, కన్నెపల్లి పంప్ హౌస్ స్విచ్ వేస్తే కాళేశ్వరం నీళ్లు వచ్చే అవకాశం ఉన్నా ఇవ్వడం లేదని తెలిపారు. సమీక్షలు పెట్టడం తెలియని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారన్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్‌లో నీళ్లు రెడీగా ఉన్నాయి ఇవ్వండంటే చాతగాదు గానీ, దేవాదుల నుంచి తీసుకొస్తానంటున్నాడని.. ఎక్కడో ఒక చోట నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎంతో ఘన చరిత్ర ఉన్న ఉస్మానియా యూనివర్సిటీలో ధర్నాలు, నిరసనలు చేస్తావా? ప్రజాపాలన అన్న నీకు ఎందుకు భయమైతున్నదని సీఎంను ప్రశ్నించారు. ఉస్మానియాలో ఉద్యమం చేస్తే కేసులు పెడుతామంటే భయపడబోమని, ఎన్నికల ముందు ఏం మాట్లాడారో ఇప్పుడు ఏం మాట్లాడుతున్నారో ప్రజలు గమనించి తెలంగాణ అస్థిత్వాన్ని కాపాడుకోవాలని, చంద్రబాబుకు చెంచాలా పని చేస్తున్న ముఖ్యమంత్రికి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, మాజీ ఎంపీపీ నెమ్మాది భిక్షం, జీడి భిక్షం, బీఆర్ఎస్ ఆత్మ కూర్.ఎస్ మండలాధ్యక్షుడు తూడి నర్సింహారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి బూర బాలసైదులు, నాయకులు బొమ్మగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలి

ఈ నెల 20న సూర్యాపేటలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జరుగనున్న బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, మల్లయ్యయాదవ్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని, మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యేలు హాజరవుతారని తెలిపారు. బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, మండలాల అధ్యక్షులు, రైతు సమన్వయ కమిటీ సభ్యులు, గ్రామ గ్రామం నుంచి ముఖ్య నాయకులు హాజరు కావాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ 25 వసంతాల సందర్భంగా వరంగల్‌లో ఏప్రిల్ 27న నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభ విజయవంతంపైనా చర్చించనున్నట్లు తెలిపారు. అలాగే జిల్లాలో వచ్చిన కరువుతో సాగునీరు ఇవ్వకుండా కాళేశ్వరంలో నీళ్లున్నా కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందని నీళ్లు బంద్ చేసి రైతుల పంటలను తీరుపై, విద్యుత్, ప్రజల మౌలిక సమస్యలపై చర్చించడం జరుగుతుందని పేర్కొన్నారు.

సాగు నీటి కోసం పోరుబాట

- **బురుజుబావి నుంచి వెల్మజాల వరకు కాల్వ కట్ట వెంట మాజీ ఎమ్మెల్యే సునీత, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల పాదయాత్ర**
- **గుండాల మండలానికి నవాబ్‌పేట రిజర్వాయర్ నుంచి నీళ్లు ఇవ్వాలని ఉద్యమం**

ఎండిన దేవాదుల కాల్వను పరిశీలిస్తున్న ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

గుండాల, మార్చి 17 : గుండాల మండలానికి నవాబ్‌పేట రిజర్వాయర్ నుంచి సాగునీరు అందించి చెరువులు నింపాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి పోరుబాట పట్టారు. దేవాదుల కాల్వల ద్వారా నీళ్లు ఇవ్వాలంటూ సోమవారం బురుజుబావి గ్రామం నుంచి వెల్మజాల వరకు దేవాదుల కాల్వ కట్ట వెంట పాదయాత్ర చేశారు. ఎండిన వరి పొలాలు, చుక్క నీరు లేని దేవాదుల కాల్వలను పరిశీలించారు. బురుజుబావి గ్రామంలో ఎండిన పంటలను చూపుతూ రైతులు గోడు వెల్లబోసుకున్నారు. కేసీఆర్ హయాంలో పంటలు బాగా పండాయని, ఇప్పుడు ఎక్కడ చూసినా ఎండిపోయే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గొంగిడి సునీత, కంచర్ల మాట్లాడుతూ గుండాల మండలానికి నవాబ్‌పేట రిజర్వాయర్ ద్వారా సాగునీరు ఇవ్వాలని రైతులు పలుమార్లు ప్రభుత్వాన్ని వేడుకున్నా కనీస స్పందన కరువైందన్నారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో ఏడు సార్లు సాగునీరు ఇచ్చి చెరువులు నింపామని గుర్తు చేశారు. స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఇకనైనా కండ్లు తెరువాలని, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడి దేవాదుల మోటార్లు ఆన్ చేసి సాగు నీరు విడుదల చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎండీ ఖలీల్, మాజీ వైస్ ఎంపీపీ మహేశ్వరం మహేందర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మూగల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎటుచూసినా ఎండిన పొలాలే

పెన్‌పహాడ్ మండలం 80శాతం ఎండిన వరి పైర్లు

- **15,562 ఎకరాలకు గానూ 12వేలకుపైనే నష్టం**
- **కాళేశ్వరం నీళ్లు రాకపోవడంతోనే దుర్భర పరిస్థితులు**
- **మిగిలిన కొద్దిపాటి పంటలకే నీళ్లివ్వాలని రైతుల వేడుకోలు**

సూర్యాపేట, మార్చి 17 (నమస్తే తెలంగాణ)/పెన్‌పహాడ్ : పదెకరాల్లో వరి నాటు పెడితే ఏడెకరాలు ఎండింది.. ఆరెకరాలకు నాలుగెకరాలు గొర్ల మేతకు తప్ప ఎందుకూ పనికి రాలేదు. మూడెకరాలకు ఎకరం మాత్రమే అట్టట్ల ఉంది. అదైనా నీళ్లందితేనే చేతికి వచ్చేది. పెన్‌పహాడ్ మండలంలో ఏ రైతును కదిలించినా ఇవే మాటలు వినిపిస్తున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పుష్కలంగా కాళేశ్వరం నీళ్లు రావడంతో అలాగే వస్తాయనుకొని పెన్‌పహాడ్ మండల రైతులు ఈ యాసంగిలో వరినాట్లు పెట్టారు. తీరా చుక్క నీరు రాకపోవడంతో దాదాపు 80 శాతం పంట ఎండిందని రైతులు వాపోతున్నారు. ఇక్కడ కాల్వలు, చెరువుల కింద కలిపి ఎస్ఆర్ఎస్పీ ఆయకట్టు పరిధిలో 15,562 ఎకరాల సాగు భూమి ఉండగా, ఇప్పటికే 12వేలకు పైనే ఎకరాల్లో ఎండిపోయినట్లు తెలుస్తున్నది. ఈ సీజన్‌లో గోదావరి జలాలు మొత్తానికే రాకపోవడంతో బోర్లు, బావులు సైతం వట్టిపోయి నష్టపోయారు.

2018లో కాళేశ్వరం ప్రాజెక్టు అందుబాటులోకి రాగా, నాటి నుంచి 2023 యాసంగి వరకు నిరంతరాయంగా ఎస్సారెస్పీ కాల్వల్లో గోదావరి జలాలు ప్రవహించాయి. చివరి ఎకరా వరకూ కాళేశ్వరం జలాలు చేరాలని బీఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పటి జిల్లా మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారు. మండలంలోని మేగ్యాతండా పద్ద గెయిల్ ఇండియా గ్యాస్ పైప్‌లైన్ కాల్వలకు అడ్డుగా ఉండగా, అధునాతన టెక్నాలజీతో పైప్‌లైన్ కింద నుంచి సొరంగం తవ్వించి ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు నిర్వహించి మండలానికి చిట్టచివర ఉన్న మాచారం గ్రామ చెరువును సైతం నింపారు. దానికితోడు నీళ్ల విడుదల చేసిన వెంటనే ముందుగా చివరి ప్రాంతాలకు పంపించాలని అధికారులు సూచించడంతో చివరి నుంచి ప్రారంభం వరకు ఎక్కడ చూసినా చెరువులు నిండుకుండలా కనిపించేవి. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. అలాంటి కృషితో నాడు రైతులు ఏ రందీ లేకుండా పంటలు పండించారు.

కాంగ్రెస్ పాలనలో..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కాళేశ్వరం బండ్ పెట్టడంతో 2024 తొలి యాసంగికే నీళ్లు కరువయ్యాయి. ప్రస్తుత యాసంగిలోనూ ప్రధాన కాల్వ అయిన డీబీఎం 71లో చిన్నపాటి పాయ కనిపిస్తున్నది. పొలాలకు వెళ్లాల్సిన పిల్ల కాల్వల్లో నీళ్లే లేవు. దాంతో పెన్‌పహాడ్ మండలంలోని భక్తశాపురం, ధర్మాపురం, మేగ్యాతండా, దుబ్బతండా, మహ్మదాపురం, గాజులమల్కాపురం, నూర్జహాన్‌పేట, మాచారం, గూడెపుకుంటతండా, జల్మాల కుంట, చిన్నగారెకుంట, పెద్దగారెకుంట, చెట్ల ముకుందాపురం తదితర గ్రామాల్లో 80శాతం పంటలు ఎండిపోయాయి. ఆ పొలాల్లో రైతులు పశువులు, జీవాలను మేపుతున్నారు. వారాబందీ ప్రకారం ఇప్పటి వరకు ఐదు సార్లు నీటిని విడుదల చేసినా ఇక్కడి అంతం తమాత్రంగా కూడా నీళ్లు చేరలేదు. మరో విడతగా చివరిసారి విడుదల చేసినా మిగిలిన పంటలు కూడా కోలుకోనేలా లేవు. కొన్నిచోట్ల రైతులు పంటలను కాపాడుకునేందుకు ట్యాంకర్ల ద్వారా నీళ్లు పెడుతూ భగీరథ ప్రయత్నం చేస్తున్నారు.

గాజుల మల్కాపురంలో వాటర్ ట్యాంకర్‌తో పొలానికి నీళ్లు పెడుతున్న రైతు గుండా వెంకన్న దంపతులు

ఎండిన వరి చేనులో రైతు లావూరి రాంబాబు

నీళ్లియ్యడం చేతగాని ప్రభుత్వం పంటలు ఎండబెట్టి

మా తాతల నాటి నుంచి 2018 వరకు కూడా మా భూములకు ఎన్నడూ నీళ్లు రాలేదు. కేసీఆర్ పుణ్యమాని కాళేశ్వరం నీళ్లు రావడంతో 2023 వరకు ఏడాదికి రెండు పంటలు పండించుకున్నం. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కేసీఆర్ ఇచ్చినట్లే నీళ్లు ఇస్తుందని అనుకుని ఏడెకరాల్లో వరి నాటు పెట్టినం. నీళ్లు రాక ఐదెకరాలు ఎండింది. మిగిలిన పంటలైనా దక్కాలంటే ఇంకో నెల రోజులు నీళ్లు అందాయి. బోర్లేమే ఆగి ఆగి పోస్తున్నయి. రేవంత్‌రెడ్డి సర్కారు రైతులపై కక్ష గట్టినట్టే నీళ్లివ్వట్లేదు. ఎకరానికి రూ.40వేలు పెట్టుబడి అయ్యింది. గత్యంతరం లేక ఎండిన పంటను ఎకరాకు 1,500 రూపాయల లెక్కన గొర్ల మందకు ఇచ్చిన. నీళ్లియ్యడం చాతగాని ప్రభుత్వం ఉంటే ఎంత? పోతే ఎంత? ఇప్పటికైనా కనికరం చూపి నీళ్లిస్తే ఆ రెండెకరాలైనా చేతికి వస్తుందని ఆశ.

-లావూరి రాంబాబు, రైతు, జల్మాల్‌కుంటతండా, పెన్‌పహాడ్ మండలం

అంగన్‌వాడీలకు రూ.18వేల వేతనం ఇవ్వాలి

- **సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా**

నల్లగొండ కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

నల్లగొండ, మార్చి 17 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో నల్లగొండ కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీలు సోమవారం ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. అంగన్‌వాడీ టీచర్లకు రూ.18వేల వేతనంతో పాటు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కింద రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ టీచర్లందరికీ టీఏ, డీఏతో పాటు కులగణన సర్వే, బీఎల్ఓ సర్వే వేతనాలు ఇవ్వాలని కోరారు. అనంతరం 23 డిమాండ్లతో కూడిన వినతి పత్